# నిత్య యాత్రలో విచిత్ర

రాజారావుమీద తనకున్న కసినంతా తీర్చుకొనడానికి లక్ష్మీకాంత్ కు చక్కని అవకాశమే దొరికింది. కాని ఏం లాభం. పతివలలో పడక తప్పిందికాదు. ఇంతకూ...

రాజారావుకి అవాళ చాలా చెడ్డరోజు. మధ్యాహ్నము మూడు గంటలకు, అతన్ని ఉద్యోగం లోంచి ఎందుకు డిస్మిస్ చెయ్యకూడదో సంజాయిషీ యిమ్మని, మేనేజరు అతనికి నోటీసిచ్చాడు. అప్పటినుంచి అతని మనసు మనసులో లేదు.

'డన్వర్ కంపెనీ' (పెట్రోలియమ్ ప్రొడక్ట్స డిస్ట్రిబ్యూటర్సు) బ్రాంచి ఆఫీసులో 'కరెస్పాండెన్సు' గుమాస్తాగా అయిదేళ్లనుంచీ పనిచేస్తున్నాడు రాజారావు. చాలా ఉత్సాహం, పలుకుబడీ గల యువకుడు. ఆఫీసులోనూ, బయటా కూడా నలుగురిచేతా మంచి అనిపించుకుంటున్నవాడు. అతనికీ, మేనేజరు లక్ష్మీకాంత్ కీ మాత్రం పడలేదు.

లక్ష్మీకాంత్, ఆ వూరికి క్రొత్తగా వచ్చిన బ్రాంచి మేనేజరు. చాలా అసూయాపరుడు. పొట్టిగా, నల్లగా, స్ఫోటకం మచ్చలతో చూడ్డానికి అసహ్యంగా ఉంటాడు. అతనిలో—ఇతరుల్ని ద్వేషించేస్వభావం, అహంభావం, ఆఫీసులో అందర్నీ నోటికి వచ్చినట్లు కసరడం — మొదలైన గుణాల్నిచూసి, ఆఫీసులో అందరూ లోలోపల, అతన్నసహ్యంచుకొనేవారు.

టైపిస్టు మేరీకి, లక్ష్మీకాంత్ దగ్గర పని చెయ్యడం మరీ కష్టంగా ఉండేది. ఆఫీసులో అందరితోకన్నా రాజారావుతో ఎక్కువ చనువుగా మెసిలేది. లక్ష్మీకాంత్ కి రాజారావును చూస్తే అసూయ కలగడానికి అదొక కారణం.

లక్ష్మీకాంత్ రోజూ ఏదో ఒక నెపంతో రాజారావుని ఏహోమాట అంటూండేవాడు. రాజారావుది యువక రక్తం. ఎప్పటి కప్పుడు లక్ష్మీకాంత్ కు తగిన జవాబు చెబ్దామనుకుంటూ—అతననే మాటలకు మొహం ఎర్రబారి, కళ్లల్లో రక్తపు జీరలు కన్పించి, మళ్లీ అతికష్టంమీద తనని తను కంట్రోల్ చేసుకొని తన సీటులోకి తిరిగి వచ్చేవాడు. లక్ష్మీకాంత్, అతని నోర్పుకు అంతిమ పరీక్ష పెట్టి, అతన్నే ఉద్యోగం వదిలిపెట్టి పారిపొయ్యేట్టు చేద్దామని ప్రయత్నిస్తూండేవాడు. రాజారావు ఎలాగైనా ఓటమినంగీకరించకుండానిలబడి, లక్ష్మీకాంత్ ప్రయత్నాన్ని వ్యర్థం చెయ్యాలని చూసేవాడు.

లక్ష్మీకాంత్ ఒకనాడు — రాజారావుని అనరాని దుర్భాషలు అని, అతనికీ, మేరీకీ ఉన్న సంబంధాన్ని గురించి దెప్పి పొడిచాడు. దాంతో రాజారావు కోపం హద్దుదాటి పోయింది. అతను మేరీని ఒక సోదరిలా చూసుకునేవాడు. అటువంటి స్థితిలో—లక్ష్మీకాంత్, తనకీ, మేరీకీ అవాచ్యమైన సంబంధాన్ని అంటగట్టడంతో రాజారావు లక్ష్మీకాంత్ ని చెళ్లుమని ఒక లెంపకాయ కొట్టేడు.

ఇంకా కొట్టేవాడే కాని, ఇంతలో తక్కిన గుమాస్తాలంతా చేరి రాజారావుని మేనేజరు గది లోంచి బయటకు తీసుకువచ్చారు. లక్ష్మీకాంత్ కి ఈ అవమానం సహించరానిదైంది. రాజారావును డిస్మిస్ చేయిస్తానన్నాడు. పోలీసు రిపోర్టు చేస్తానన్నాడు. కాని, ఏ రిపోర్టులు తను చేసినా రాజారావుకు వ్యతిరేకంగా ఆ ఆఫీసులో తనకు సాక్ష్యం దొరకదని తెలుసు.

ఏది ఏమైనా, పైకి వ్రాసి రాజారావుమీద తగిన చర్య తీసుకొంటానన్నాడు మేనేజర్ లక్ష్మీకాంత్. ఆఫీసు అక్కౌంటెంటు, సీతారామయ్యగారూ, కాషియర్ వేదనాయకంగారూ ఇరుపక్షాల్నీ శాంతింపజేశారు. రాజారావుకు తను చేసిన పని మంచిదికాదని నచ్చచెప్పారు. ఉద్యోగం వూడేటంత వరకూ వెళ్లవచ్చునన్నారు. రెండు రోజులు అతనికి బాగా నచ్చచెప్పి, అతను చేసిన పనికి—పశ్చాత్తాప పడేలా చేశారు.

ఇటు లక్ష్మీకాంత్ ను కూడా, శాంతపరచి, రాజారావుమీద పెద్ద చర్యేమీ తీసుకోకుండా ఉండేందుకు ప్రయత్నించారు. మేనేజరును కాబట్టి తనకు ముఖస్థంగా గాని, లిఖితపూర్వకంగా గాని క్షమాపణ చెప్పుకుంటే రాజారావుమీద ఎట్టి



# పాత్ర — రంగధామ్

చర్యా తీసుకోనన్నాడు, లక్ష్మీకాంత్.

రాజారావు మొదట క్షమాపణ చెప్పుకోనని పట్టుబట్టాడు. కాని, వేదనాయకంగారు అతనికి ఎంతో బోధపరచిన తరువాత, వ్రాతపూర్వకంగా క్షమాపణ రాసియిచ్చాడు. అందులో—తను ఉద్రేకంలో లక్ష్మీకాంత్‌ను కొట్టినట్లూ, అందుకు తానిప్పుడు విచారిస్తున్నట్లూ—వ్రాశాడు. వేదనాయకంగారు ఆ కాగితం తీసికెళ్లి లక్ష్మీకాంత్‌కిచ్చి "ఏదో యంగ్ బ్లడ్' సార్! తెలియక అట్లా ప్రవర్తించాడు. అన్నీ తెలిసిన తమరు అనుగ్రహించాలి" అని రాజారావు తరపున బ్రతిమాలి, తన సీట్లోకి వచ్చాడు.

లక్ష్మీకాంత్ ఇటువంటి అవకాశం కోసమే ఎదురు చూస్తున్నాడు. రాజారావ్‌మీద తనకున్న కసినంతా తీర్చుకోవా లనుకొన్నాడు. రాజారావ్ యిచ్చిన క్షమాపణ పత్రం ఆధారంగా, రాజారావుమీద ఘాటైన రిపోర్టు తయారుచేశాడు. ఆఫీసు పద్ధతి ప్రకారము రాజారావుమీద నేరారోపణ చేస్తూ, అతను చేసిన పనికి, తగిన చర్య (డిస్‌మిస్) ఎందుకు తీసుకోకూడదో సంజాయిషీ యిమ్మని నోటీసిచ్చాడు.

రాజారావుకి నోటీసు చదువుకోగానే నెత్తిమీద పిడుగు పడ్డట్లయింది. తను పూర్తిగా మోసపోయానని గ్రహించాడు. లక్ష్మీకాంత్ తనని మోసంచేసి, వెనకనుంచి దెబ్బ కొట్టాడని తెలుసుకున్నాడు. మొదట లక్ష్మీకాంత్ తనమీద రిపోర్టు చేసివుంటే, విచారణలో ఆఫీసులో రాజారావుకి వ్యతిరేకంగా ఎవరూ సాక్ష్యమిచ్చి ఉండేవారు కారు. ఇప్పుడు తాను స్వయంగా చేసిన తప్పు పని—రాసివ్వడంవల్ల ఏ విచారణా అక్కరలేకుండానే లక్ష్మీకాంత్ తనని డిస్‌మిస్ చేయించగలడు.

"కెలిగ్రాం, సార్" అనే మెసింజర్ మాట విని రాజారావు ఉలిక్కిపడ్డాడు. సంతకంచేసి, ఒకసారి చదువుకొని, యాంత్రికంగా జేబులో పెట్టేసుకున్నాడు. అది ఆఫీసు టెలిగ్రాం. అందులో—వాళ్ల బ్రాంచెస్ అన్నిటిమీదా అధికారి అయిన — మల్హోత్రా అనే ఆఫీసరు ప్రోగ్రాం ఉంది.

రాజారావు సాయంకాలం ఆరుగంటల దాకా ఆఫీసులో ఆలోచిస్తూనే కూచున్నాడు. అతని తోటి గుమాస్తా సత్యనారాయణ అనే అతను వచ్చి "ఏమిటోయ్! ఇవాళ మన ఫ్రెండు 'ఎం. ఎల్. పతి' ప్రదర్శన 6—30 గంటలకి సిటీ హాలులో వుందని మర్చిపోయావా? పద, పద తొందరగా వెళ్దాం. మనం వెళ్లకపోతే అతను ఏమైనా అనుకుంటాడు" అని రాజారావును లేవదీశాడు. రాజారావు అప్పటికి లోకంలో పడ్డాడు.

ఇద్దరూ పని ముగించుకుని, సిటీ హాలు వద్దకు వెళ్లారు. సిటీ హాలులో ఆనాడు 'ఎం. ఎల్. పతి' అనే ప్రఖ్యాత మోనోయాక్టరు ప్రదర్శన ఏర్పాటు చేయబడింది. రాజారావు, సత్యనారాయణ, ఎం. ఎల్. పతి, చిన్నప్పటినుంచీ స్నేహితులు.

'పతి' చాలా బాగా మోనో యాక్టింగు చేస్తాడు. 'ఒథెల్లో', 'కింగ్‌లియర్', 'మర్చెంట్ ఆఫ్ వెనిస్' మొదలైన షేక్స్‌పియర్ డ్రామాల్లోంచీ, 'మోలియర్', 'షెరిడన్', 'షా' మొదలైనవారు రచించినవాటిలోంచీ, కొన్ని ఘట్టాలు అద్భుతంగా ప్రదర్శించి చూపించాడు. మోనో యాక్టింగే కాక వివిధ రకాల వ్యక్తులు, తమకు తెలియకుండానే ఎలా ప్రవర్తిస్తారో, అలవాటు పడారో వివరిస్తూ మంచిహాస్య రసపూరితమైనలెక్చరిచ్చాడు. తరువాత 'మిమిక్రీ' అనుకరణ చేసిచూపించాడు. ప్రదర్శనకు చాలామంది ధనవంతులూ, విద్యావంతులూ వచ్చారు. 'పతి' యొక్క ప్రతిభను మెచ్చుకొని అతన్ని సన్మానించేరు.

ప్రదర్శన అయిపోగానే రాజారావూ, సత్యనారాయణా 'గ్రీన్‌రూమ్' లోకి వెళ్లి పతిని కలుసుకున్నారు. వీళ్లిద్దర్నీ చూసి అతడు బ్రహ్మానందం పొందాడు. "ఒరేయ్ రాజా! రెండేళ్ల క్రితం మనం కలుసుకొన్నప్పటికన్నా బాగా చిక్కిపోయావురా. ఏరా సత్యం, వీడు తిండి సరిగ్గా తినడంలేదేమిట్రా? ఇలా అయిపోయాడు" అని స్నేహితు లిద్దర్నీ పరామర్శ చేశాడు.

సత్యనారాయణ "అదంతా చాలా పెద్ద కథ వుందిలేరా! ముందు ఇంటికి పోదాం పద. తరువాత విషయా లన్నీ వివరిస్తాం" అన్నాడు.

పతి, "ఇంటి కెందుకురా? ఎల్లుండి బెజవాడలో ప్రదర్శన ఉంది. రాత్రి బండీ ఎక్కేద్దామనుకుంటున్నాను."

సత్యం, రాజారావు అలా వీల్లేదన్నారు. సత్యం ఇంటిలో రాత్రి డిన్నరు ఏర్పాటు జరిగింది. పతి అతికష్టంమీద, రాత్రి వాళ్లతో గడపడానికి అంగీకరించాడు. ముగ్గురూ సత్యనారాయణ ఇంటికి వెళ్లారు.

భోజనా లయ్యాక డాబామీద వెన్నెల్లో కూచొని తాంబూలం వేసుకుంటూ, సిగరెట్టు పొగలు వదులుతూ కబుర్లు చెప్పుకోవడం ప్రారంభించారు.

పతి అడిగాడు, "ఏమిట్రా ఇందాక రాజా గురించి ఏదో పెద్ద కథ ఉందన్నావు?"

సత్యం, రాజారావు కలిసి ఆఫీసులో జరిగినదంతా పతికి చెప్పారు.

అంతా విని పతి, రాజారావుతో "నిన్ను పేపరు మీద 'కమిట్' అవద్దని ఎన్నిసార్లు చెప్పానురా!

(43-వ పేజీ చూడండి)



# నిత్యయాత్రలో...

(29-వ పేజీ తరువాయి)

మొదటినుంచీ నువ్వింతే. అందర్నీ నమ్మేస్తావు. ఆ మేనేజరును లెంపకాయ కొట్టి, వాడికి కాగితం మీద 'ఎపాలజీ' రాసిస్తావా! ఏమైనా ఆలోచించి చేసిన పనేనా అది ?" అన్నాడు.

రాజారావ్, "ఏం చెయ్యమంరా బ్రదర్! ఆఫీసులో అంతా ఎపాలజీ యిమ్మని బలవంతం చేశారు. ఏదో కాగితంముక్కమీద రెండక్షరాలు గోకేస్తే సరిపోతుంది కదా అని రాసిచ్చాను. వాడు ఇలా మోసం చేస్తాడనుకోలేదురా!"

సత్యం, "ఆ కాగితం లేకుండా చేసేస్తే ఏ గొడవా వుండదురా."

రాజారావు "లాభంలేదురా. మేనేజరు ఆ కాగితాన్ని, కడుపున పుట్టిన బిడ్డని తల్లి ఎంత జాగ్రత్తగా చూసుకుంటుందో అంత జాగ్రత్తగా చూసుకుంటున్నాడటరా."

పతి, "హెడ్డాఫీసుకు ఇంకా రిపోర్టు పంపలేదా ?" అని అడిగాడు.

సత్యం, "లేదురా. రేపు హెడ్డాఫీసునుంచి ఒక పెద్ద ఆఫీసరు వస్తున్నాడు. ఈ ఫైలు వాడి ముందు పెట్టి వాడిచేత 'డిస్మిసల్' ఆర్డరు వేయిద్దామని చూస్తున్నాడు."

రాజారావు చటుక్కున ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలా, "ఒరే అన్నట్టు మల్హోత్రా ప్రోగ్రాం కాన్సిలయిందిరా. సాయంకాలం టెలిగ్రాం వచ్చింది. అది నేను జేబులో పెట్టేసుకుని, మేనేజరుతో చెప్పడం మర్చిపోయాను."

సత్యం, పతి ఒక్కసారి "ఆ" అన్నారు.

రాజారావు జేబులోంచి టెలిగ్రాం కాగితం తీసి "ఇదిగోరా!" అని వాళ్ళిద్దరికీ చూపించాడు. అందులో మల్హోత్రా ప్రోగ్రాము కాన్సిల్ చేసుకొని, తిన్నగా కలకత్తా వెళ్ళిపోతున్నట్టుంది.

సత్యం, "చంపేశావురా. అసలే మేనేజరు నీమీద మండిపడిపోతున్నాడు. ఇలాంటప్పుడు ఇంత ముఖ్యమైన కాగితం నువ్వు జేబులో పెట్టుకుని మర్చిపోయావని తెలుస్తే మరీ అగ్గి పిడుగైపోతాడు."

రాజారావు బాగా నిరుత్సాహపడిపోయి 'ఒరేయ్! మన రోజులు బొత్తిగా బాగాలేవురా. ఉద్యోగం వూడటం ఖాయం—కానీ, ఏం చేస్తాం ?"

సత్యం నిరుత్సాహపడిపోయిన స్నేహితుడికి కొంచెం ధైర్యం కలిగిద్దామని "పరవాలేదురా. నువ్వు పొద్దున్నే లేచి వెళ్ళి ఆయన్ని ఇంటి దగ్గర దర్శనం చేసుకుని ఈ కాగితం సమర్పించు. కొంచెం వినయ విధేయతలు ప్రదర్శిస్తే ఏమైనా లాభించవచ్చు" అన్నాడు.

రాజారావు "ఒరేయ్, ఉద్యోగం పోతే పోనీ, వాడికి తగిన శాస్తి చెయ్యాలి గాని, వాడికి లొంగిపోకూడదు" అన్నాడు పతివైపు చూస్తూ.

పతి, "అల్లాగయితే అసలు టెలిగ్రాం వచ్చినట్టే వాడితో యిప్పుడు చెప్పకు. తరువాత ఎప్పుడైనా ఆ విషయంగురించి ప్రస్తావన వస్తే చూసుకోవచ్చు."

రాజారావు తన శత్రువుమీద ఏదోవిధంగా పగతీర్చుకుంటున్నట్లు చిరునవ్వు నవ్వుతూ, "అంతేరా. టెలిగ్రాం సంగతి వాడితో చెప్పను. రేపంతా వాడు పడే గాభరా, మల్హోత్రా ఎప్పుడు వస్తాడో అని పొందే ఆతృతా, కంగారు చూసి మనంఆనందించవచ్చు"అన్నాడు. సత్యం ఏమీఅనలేదు.

పతి, "అసలీ మల్హోత్రా ఎవడు ?"

సత్యం, "మా బ్రాంచెస్ అన్నీ కంట్రోలు చేసే ఆఫీసరురా. రెండువేలకు పైగా జీతం ఉంటుంది. కారూ, బంగళా అన్నీ కంపెనీ యిస్తుంది. బ్రహ్మ తన ప్రక్కన సరస్వతిని కూచోబెట్టుకుని సరససల్లాపా లాడుతున్న సమయంలో సృష్టించిన వ్యక్తుల్లో ఒకడు."

రాజారావు, "బాగుంది. మనల్నెప్పుడు సృష్టించాడంటావు ?"

"తెలుస్తూనే వుందికదరా. ఏ రాక్షసులొచ్చి దేవతల్ని హింసించినప్పుడో, లేక సరస్వతి అతని మీద అలిగి పెడమొగం పెట్టినప్పుడో, లేక నారదుడు వచ్చి ఆస్తిలో తన వాటా పంచెయ్యమని అడిగినప్పుడో, విసుగుతో, చిరాకుతో, కోపంతో, మనలాంటి దరిద్రుల్ని సృష్టించి ఉంటాడు."

పతి, నవ్వుతూ, "అది సరేలే, అసలీ మల్హోత్రా ఎలా ఉంటాడు ? వయస్సెంత ? ఎటువంటి తత్వంగల మనిషి ?—అని."

"వాడి నెవరూ ఇంతవరకూ చూడలేదు. వయస్సు మనలాగే ముప్పై ఉండొచ్చు. కంపెనీలో సంవత్సరం క్రిందే చేరాడు—'కవెనెంటెడ్ రాంకు' లో. ఫారిన్ వెళ్ళి ట్రైనింగు అయి వచ్చాడు. చార్జి తీసుకుని మూడునెల లవుతుంది. ఇదే అతని మొదటి 'విజిట్'. ఇంతకు తప్ప మనకేం తెలియదు."

"అయితే మల్హోత్రాని ఆఫీసులో ఎవరూ చూడలేదంటావు."

"లేదు.

"ఒరేయ్ పతీ! నీకు పెద్దపెద్ద వాళ్ళతో స్నేహం ఉందికదా, అవసరమైతే మల్హోత్రాకి ఎవరిచేతనయినా రికమెండు చెయ్యించాలిరా" అన్నాడు రాజారావు.

"తప్పకుండా నీ ఉద్యోగానికి నా ప్రాణం అడ్డు" అన్నాడు పతి.

సత్యం, పతి, రాజారావూ తెల్లవార్లూ కబుర్లు చెప్పుకుంటూ, కాలం గడిపారు. పొద్దున్నే కాఫీ త్రాగి, పతి స్నేహితు లిద్దరి దగ్గరా సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

స్నేహితు డున్నంతసేపూ రాజారావు మనస్సు హుషారుగా ఉంది. అతను వెళ్ళిపోయిం దగ్గర్నుంచి రాజారావుకి దిగులు ప్రారంభమైంది. తన ఉద్యోగం అతిప్రమాద పరిస్థితుల్లో ఉంది. తొమ్మిదిన్నరకు భోంచేస్తూ భార్యా, బిడ్డలవైపు చూస్తుంటే అతనికి దుఃఖం పొంగుకొచ్చింది. ఎలాగో ఆపుకొని, ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

మేనేజరు లక్ష్మీకాంత్, పదిగంటలకల్లా, నీటైన సూటు వేసుకుని, ఆఫీసంతా పరిశుభ్రంగా ఉందా, లేదా అని పరీక్ష చేసి తన గదిలోకి వెళ్ళిపోయాడు. మేరీ, పసుపు పచ్చటి సిల్కు గౌనులో తళతళ మెరిసిపోతూ వెళ్ళి తన సీటులో కూర్చొంది. ఆఫీసులో అందరూ తమ తమ పనుల్లో నిమగ్నులయ్యారు.

పదకొండు గంటలకి రోడ్డుమీద కారు 'హారను' విన్పించింది.

మేనేజరు తన సీటులోంచి గబగబా లేచి, కారులో వచ్చింది మల్హోత్రా అని వూహించి, అతనికి స్వాగత మివ్వడానికి వెళ్ళాడు. కారులోంచి ట్వీడ్ సూటూ, సిల్కు టై, కళ్ళకు గాగుల్సూ, ఫెల్టుహేట్‌తో ఒక వ్యక్తి అచ్చు దొరగారిలా ఉన్నాయన—దిగాడు. మేనేజరును చూసి, 'నువ్వేనా ఇక్కడి మేనేజరువి ?" అని అడిగాడు.

"చిత్తం" అంటూ, మేనేజరు, దొరగార్ని తన గదిలోకి తీసుకు వెళ్ళాడు.

దొరగారు, ఆఫీసులోకి ప్రవేశిస్తూ—చుట్టూ చూసి" ఆఫీసుయొక్క 'అపియరెన్సు' ఏమీ బాగాలేదు." అన్నారు.

అసలే లక్ష్మీకాంత్‌కి పై ఆఫీసర్లంటే భయం. దానికి తోడు తను బ్రాంచి మేనేజరవటం కొత్త— ఇది మొదటిసారి 'ఇన్‌స్పెక్షన్.' వస్తూనే దొరగారు ఆఫీసు 'అపియరెన్సు' బాగా లేదన్నారు. దాంతో అతనికి తల తిరిగినంత పనైంది. ఎలాగో ధైర్యం చిక్కబట్టుకొని "నేను వచ్చిన తరువాత చాలా ఇంప్రూవ్ చేశాను సార్. అసలు అంతకుముందు బొత్తిగా బాగుండేది కాదు" అన్నాడు.

దొరగారు అతనివేపు తీక్షణంగా ఒక నిముషం చూసి—అధికార స్వరంతో "ఇంకా ఇంప్రూవ్ చెయ్యాలి" అని అన్నారు.

లక్ష్మీకాంత్ "చిత్తం, సార్" అన్నాడు. ఇంకా వినయం చూపిస్తూ.

దొరగారు, మార్కెట్ గురించీ, బిజినెస్ గురించీ అనేక ప్రశ్నలు వేశారు. లక్ష్మీకాంత్ తడుముకోకుండా జవాబిచ్చాడు. తరువాత ఆఫీసు

---

ఒకాయన బండెడు పాత జోళ్లు బాగుచేయిస్తున్నాడు. అప్పుడు అతని మిత్రుడొకడు అతనితో యిలా అన్నాడు.

మిత్రుడు:- అదేమిటండోయ్! అన్ని పాత చెప్పు లెక్కడ సంపాదించారు.

ఆయన:-నిన్న నాటకం వేశాంకదండీ. అప్పుడు ప్రేక్షక సమూహంనుండి ఈ కానుకలు స్టేజిమీద కురిశాయి. వీటితో షాపు పెట్టాలను కొంటున్నాను.

టి. భాస్కరరావు (కాకినాడ)

---




హెచ్చు ఇంజనీరింగు జ్ఞానమువల్ల హెచ్చురకము
పంకాలు చేయబడుచున్నవి

అదే
ఓరియంట్
విధానము



**ఓరియంట్**
పంకా
ఏండ్లతరబడి కంటికింపై
పనిచేయుటలో ముందంజ

ASP-OGI-4

ఓరియంట్ జనరల్ ఇండస్ట్రీస్ లి., కలకత్తా-11

ఆంధ్ర, మైసూరు రాష్ట్రములకు డిస్ట్రిబ్యూటరు : "హిందూ ... లిమిటెడ్ కెంపగౌడ రోడ్, బెంగుళూరు-9. తంతి : Dealhind, ఫోన్ : 70272.

కేరళ, మద్రాసు రాష్ట్రములకు డిస్ట్రిబ్యూటర్లు : ఓరియంట్ డిస్ట్రిబ్యూటర్లు, లికాట్స్ బిల్డింగ్, 26, ఎర్రబాలుచెట్టి వీధి, మద్రాసు-1 తంతి : Orient. ఫోన్: 4744 వాయిదాల పద్ధతిన తీసికొనుటకు క్రిందివారిని సంప్రదించండి :—

మాడరన్ డీలర్సు (పి) లిమిటెడ్, కెంపెగౌడ రోడ్, బెంగుళూరు, ఫోన్: 70272, ఓరియంట్ క్రెడిట్ కార్పొరేషన్, 26, ఎర్రబాలుచెట్టి వీధి, మద్రాసు. ఫోన్: 4744, సేల్స్ & సర్వీసు, టి. డి. రోడ్, ఎర్నాకులం; ఫోన్ : 425. సేతు ప్రమోటర్సు, గాంధీనగర్, పి. బి. నెం. 373, విజయవాడ-2; ఫోన్: 438; ఆర్. ఎమ్. ఎస్. & కో ప్రయివేట్ లిమిటెడ్, 5, పడమటి గోపురంవీధి, మదుర, ఫోన్: 671; ఆండవర్ ఎలక్ట్రిక్ స్టోర్సు, సేలం; మాడరన్ రేడియో సర్వీసు, కుంబకోణం; సార్ ఎలక్ట్రికల్ & జనరల్ ఏజన్సీస్, 2, తూర్పు కార్ వీధి, తిరునెల్వేలి; హెచ్. ఐ. పర్చేసెస్, సుల్తాన్‌బజార్, హైదరాబాద్ ; వయర్లెస్ సేల్సు&సర్వీసు కో, 28, గవర్నమెంటు హాస్పిటల్ రోడ్, వేలూరు.


## నిత్యయాత్రలో...

విషయాల గురించి అడిగారు.

"ఆఫీసులో పని బాగా సాగిపోతోందా ?"

"సార్, స్టాఫంతా మంచివాళ్లే కాని—ఒకే ఒక వ్యక్తి—చాలా అవిధేయతతో ప్రవర్తిస్తున్నాడు" అని లక్ష్మీకాంత్, రాజారావుమీద రిపోర్టు ఉన్న ఫైలు దొరగారి కిచ్చాడు.

దొరగారు అదంతా చదివి, రాజారావునుపిలవమన్నారు.

ప్యూను వెళ్ళి రాజారావును పిల్చుకొచ్చాడు. రాజారావు దొరగార్ని చూసి నమస్కరించి, చేతులు కట్టుకొని నిలబడ్డాడు.

దొరగారు అతన్నొకసారి క్రింద నుంచి మీదకి చూసి, రాజారావు రాసిచ్చిన 'ఏపాలజీ లెటరు' ఫైల్లోంచి తీసి రాజారావు చేతి కిచ్చాడు. మేనేజరు రాజారావుమీద రాసిన రిపోర్టు మేనేజరు చేతి కిచ్చారు. "ఇద్దరూ మీ కాగితాల్ని చింపెయ్యండి" అన్నారు, అధికార స్వరంతో.

రాజారావు తన కాగితం చింపేసి ముక్కలు కూడా దొరక్కుండా బయట పారేశాడు. లక్ష్మీకాంత్, ఏమీ అనలేక తెల్లబోయి, మెల్లిగా తన రిపోర్టుచింపేసి వేస్టుపేపరు బాస్కెట్‌లోపారేసాడు.

దొరగారు ఆఫీసులో డిసిప్లిన్ గురించి, సహకారతత్వాన్ని గురించి మాట్లాడారు: ఆఫీసు స్టాఫంతా అన్నదమ్ముల్లా ఉండాలన్నారు. రాజారావును ఇకనుంచి ఇలాటిపన్లు చెయ్యవద్దని హెచ్చరిస్తూ అతని సీట్లోకి వెళ్లిపొమ్మన్నారు.

రాజారావు వెళ్ళిపోయాక దొరగారు వాచీ చూసుకుని, ఏదో జ్ఞాపకం వచ్చినవారిలా "అరే చాలా టయి మయిందే! నేను వెళ్తోన్నాను" అని బయటకు కారు దగ్గరకు వెళ్ళారు. మేనేజరు కూడా ఆయన్ని సాగనంపడానికి వెళ్లాడు. దొరగారు కారెక్కుతూ కూడా మేనేజరుకు, స్టాఫ్‌ని అన్నదమ్ముల్లా చూసుకోమనిసలహాయిచ్చారు.

కారు స్టార్టయ్యింది. దొరగారు కారులోంచి బయట ద్వారం దగ్గర నుల్చునివున్న లక్ష్మీకాంత్ తో "అన్నట్టు మర్చిపోయాను— ఇదిగో నా విజిటింగ్ కార్డు. వస్తాను. మర్చిపోకండి" అని ఒక చిన్న కార్డు లక్ష్మీకాంత్ చేతిలో పెట్టారు. కారు కదిలింది.

మేనేజరు లక్ష్మీకాంత్ చేతిలో ఉన్న విజిటింగ్ కార్డు చూశాడు. 'ఎం. ఎల్. పతి'. మోనోయాక్టరు. మద్రాసు" అని ఉంది. "ఆ !" అని తలెత్తి చూసేసరికి కారు వెళ్లిపోయింది. కారు దుమ్ము కొంచెం లక్ష్మీకాంత్ కళ్ళల్లో పడింది.

సాయంత్రం రాజారావు, పతిని తెగపొగిడి తన ఉద్యోగం నిలబెట్టినందుకూ, మేనేజరుకు తగిన శాస్తి చేసినందుకు కృతజ్ఞత చెప్పుకున్నాడు. సత్యం "మా మేనేజరు చాలా తెలివైనవా డను కున్నాను. నువ్వు వాణ్ణి బాగా బుట్టలో వేశావురా" అన్నాడు.

సమాధానంగా పతి "కళారాధన చేస్తూ, పొట్ట చేత్తో పట్టుకుని వూరూరా తిరిగే మాలాటి నిత్యయాత్రికులకు తెలిసినట్టు, ప్రపంచంలోని కష్టసుఖాలు, మాయామర్మాలూ, ఆఫీసుల్లో జీవితమంతా గడిపే మీ మేనేజరులాంటి వ్యక్తులకెలా తెలుస్తుందిరా ?" అన్నాడు. ★